క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

మర్యాదపూర్వక కలయిక



దాబాగార్డెన్స్: టీటీడీ చైర్మన్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సమస్యలను వైవీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సత్వరం పరిష్కరించే విషయమై వైవీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం పంచామృతాభిషేకాలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామాగోత్రాలతో విశేషపూజలు జరిపించారు. పార్వతీదేవే కలియుగంలో ఎరుకుమాంబగా అవతరించినట్లు భక్తులు నమ్ముతారు. అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం చేయడం వల్ల కోరికలు నెరవేరుతాయని, పెళ్లి కాని వారికి పెళ్లి అవుతుందని, పిల్లలు లేని వారికి పిల్లలు పుడతారనేది భక్తుల నమ్మకం అని అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

12న కొబ్బరి చెక్కల వేలం

మహారాణిపేట : మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఈనెల 12న కొబ్బరి చెక్కలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. రెండు సంవత్సరాల కాల పరిమితికి ఈ వేలం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2025 జులై 31 వరకు దీని కాల పరిమితి ఉంటుందన్నారు. రూ. 5 వేలు ప్రథమ ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందన్నారు.

ఐటీ హిల్స్‌కు బస్సు పునరుద్ధరణ

దాబాగార్డెన్స్ : ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే ఉద్యోగుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ 25-టి సర్వీసును పునరుద్ధరించిందని, ఉద్యోగులు ఈ సర్వీసును వినియోగించుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీసు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వయా కొమ్మాది, మారికవలస మీదుగా ఐటీ హిల్స్ వెళ్తుందని, ఉదయం 6, 8, 10.45, సాయంత్రం 4, 6 గంటలకు బయలుదేరుతుందని చెప్పారు. అలాగే కార్‌షెడ్ నుంచి ఉదయం 6.30, 8.30, 9.30, మధ్యాహ్నం 12.30, 1.30, 2.30, సాయంత్రం 4.30, 6.30కి బయలుదేరుతుందని, ఐటీ హిల్స్ నుంచి ఉదయం 7, 9, 9.55, మధ్యాహ్నం 12, 1, 2, 3, సాయంత్రం 5, 7 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

అమృతవనం.. చదువుల నిలయం

ఎందరో నిరుపేద విద్యార్థినుల ఉపాధికి బాటలు వేసిన కళాశాల అది. విద్యతో పాటు క్రీడలు.. సాంస్కృతికం.. సామాజిక రంగాల్లో విద్యార్థినులను తీర్చిదిద్దుతోంది. చక్కటి తరగతి గదులు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహింపబడుతోంది. అదే విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల.

- నిరుపేద విద్యార్థినులను సర్వతోముఖంగా తీర్చిదిద్దుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహణ



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల



తరగతి గదిలో శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్ : విద్యార్థినుల ఉన్నతే లక్ష్యంగా 1975 నుంచి విద్యారంగంలో తన వంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగిపోతోంది విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థినులకు దిక్సూచిలా నిలుస్తున్న సమున్నత విజ్ఞాన భాండాగారం. విశాఖ జిల్లాలో గల ఏకైక ప్రభుత్వ మహిళా కళాశాలగా గుర్తింపు పొందింది. జాతీయ స్థాయిలో గుణాత్మక విద్యనందిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ దూసుకుపోతోంది.

చక్కటి వనరులతో విద్యాబోధన..

విశాలమైన తరగతి గదులు, ఉన్నత ప్రమాణాలు కలిగిన బోధనా సిబ్బంది, ప్రయోగశాలలు, భౌతిక వనరులు కలిగి ఉంది. విద్యార్థులకు డిజిటల్, వర్చువల్ తరగతులు.. మూక్స్ వంటి ఆన్‌లైన్ కోర్సులు కూడా కళాశాలలో నిర్వహిస్తున్నారు. విద్యార్థినులకు పోటీ పరీక్షలకు గాను ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

సత్తా చాటుతున్న విద్యార్థినులు

ఆంధ్ర విశ్వ విద్యాలయం నిర్వహించిన ఆసెట్ వంటి పరీక్షల్లో కళాశాల విద్యార్థినులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రతి ఏడాది కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ) ద్వారా నిర్వహించే క్యాంపస్ డ్రైవ్‌లు, జాబ్‌మేళాల్లో కళాశాల విద్యార్థినులు ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందుతున్నారు. జాతీయ స్థాయిలో సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ విద్యార్థినులను సాంకేతికంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు హెచ్‌పీసీఎల్ మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తోంది. కేవలం చదువులకే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆటలు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటి సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కల్పిస్తున్నారు. విద్యార్థినుల స్వీయరక్షణకు కరాటే వంటి శిక్షణ తరగతులు, మానసికోల్లాసానికి సాహిత్యం, నాట్యం, కవిత్వం వంటి సాంస్కృతిక రంగాల్లో కూడా ప్రోత్సహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు..

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఆసక్తి గల విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది సింగిల్ మేజర్ సిస్టం ద్వారా అడ్మిషన్లు నిర్వహించనున్నారు. విద్యార్థినులకు అడ్మిషన్లపై ఎటువంటి సందేహాలున్నా కళాశాల హెల్ప్‌లైన్ డెస్క్‌ను సంప్రదించి నచ్చిన గ్రూపు ఎంచుకునే అవకాశం ఉంది.

కోర్సుల వివరాలు ఇలా..

మ్యాథ్‌మెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, బోటనీ, హార్టీకల్చర్, ఎలక్ట్రానిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అలాగే హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులు లభ్యమవుతున్నాయి. అదే విధంగా బీఎస్సీ ఎంపీసీఎస్-60 సీట్లు, ఎంపీసీ-80 సీట్లు, బీజెడ్‌సీ-50 సీట్లు, ఎంబీసీ-30 సీట్లు, బీబీసీ-30 సీట్లు, సీబీహెచ్-30 సీట్లు, డీఎస్‌సీఎస్-40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల విద్యార్థినులు గిగిగి. ఐఞఊఇ. ఐ్క. ఎగ్ని ఖా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 7780168423, 7032270810, 9396235303 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రైవేట్..కార్పొరేట్‌కు దీటుగా..



ప్రైవేట్.. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. గత ఏడాది కంటే అధిక అడ్మిషన్లతో ప్రైవేట్ కళాశాలల కంటే మిన్నగా కళాశాల రాణిస్తోంది. మెరిట్ స్టూడెంట్లతో కళాశాల ప్రగతిపథంలో ముందుకు సాగుతోంది. – **డాక్టర్ ఎస్.శోభారాణి, కళాశాల ప్రిన్సిపాల్**

శిథిలావస్థలో జనతాబజార్



మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న జనతాబజార్



శ్లాబ్ పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా దుకాణ సముదాయం

- ఎప్పుడు కూలిపోతుందోనని వ్యాపారుల ఆందోళన
- ప్రత్యామ్నాయం చూపాలని అభ్యర్థన

జగదాంబ : జనతాబజార్ దుకాణ సముదాయం ప్రమాదకరంగా తయారయింది. జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న ఈ దుకాణాన్ని 70 ఏళ్ల కిందట నిర్మించారు. 72 దుకాణాల సముదాయం గల నిర్మాణం వెనుక మురుగు నీరు సముద్రంలోకి ప్రవహించే కెనాల్‌కు ఆనుకుని ఉంది. దీని వలన దుకాణాలన్నీ దాదాపు చెమ్మతో నిండిపోయి ఉంటున్నాయి. వర్షాల కారణంగా శ్లాబ్‌లు, సన్‌సైడ్లు పెచ్చులూడిపోతున్నాయి. అయినా వ్యాపారులు ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటున్నారు.

ఎవరిది బాధ్యత..

పాతనగరంలోని పలు భవనాలు కాలం చెల్లిపోయి ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. ఇటీవలే పూర్ణా మార్కెట్ ఎదురుగా రంగిరీజువీధిలో ఓ ఇల్లు, వెలంపేట ఆర్‌ఆర్‌ఎంఆర్ రోడ్డులో మరో ఇల్లు వర్షాలకు కూలిపోయిన సంగతి తెలిసిందే. అయితే అవి నివాస గృహాలు కావడంతో వాటి బాధ్యత ఆ ఇళ్ల యజమానులవే. ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న జనతాబజార్ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ది కావడంతో దాని పూర్తి బాధ్యత జీవీఎంసీపైనే ఉందని పలువురు చెబుతున్నారు. ఈ దుకాణ సముదాయం కాలం చెల్లిపోవడంతో గతంలో జీవీఎంసీ అధికారులు కోర్టు ద్వారా వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. తర్వాత దీనిపై ఎలాంటి చర్యలు లేవు. అయితే ఇటీవల పాతనగరంలో ఇళ్లు కూలిపోవడంతో జనతాబజార్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

జీవీఎంసీ ప్రత్యామ్నాయం చూపాలి

జనతాబజార్ దుకాణ సముదాయంపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారులు కోరుతున్నారు. జనతాబజార్‌ను పునర్నిర్మిస్తే ఎదురుగా ఉన్న పోర్టు స్టేడియం ప్రహరీ వద్ద గల స్థలంలో తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అలా చేయకపోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వారంటున్నారు.

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న రచయిత కె.జి.వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనం అందరినీ అలరించింది. ప్రధాన వక్త రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ సామాజిక బాధ్యతల్లో మనో వైజ్ఞానిక అంశాల పరిష్కారం దిశగా కవులు రచనలు చేయాలని సూచించారు. కవిత్వం ఒక మిత్రుడి వంటిదని, సర్వ కాలాల్లో ఆదరణ పొందుతుందన్నారు. ప్రముఖ కవి ముక్దుం మొహియుద్దీన్ గురించి సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ భాష సంస్కృతుల వికాసానికి, ఉన్నతికి కవులు, రచయితలు కృషి చేయాలన్నారు. వివిధ కవిత్వ ప్రక్రియల్లో నవ కవిత అందరినీ అలరించేలా ఉండాలని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చిన సూర్యనారాయణ, బి.రాధారాణి, కె.వి.ఎ స్.మూర్తి, డి.వి.సూర్యారావు, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత తదితరులు వివిధ అంశాలపై చదివిన కవితలు అలరించాయి.

పోషకాహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి



విద్యార్థుల తల్లిదండ్రులకు ఆరోగ్య సూచనలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ భాషిణి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ఆధ్వర్యంలో నడుస్తున్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఈ కార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథి డివిజనల్ రైల్వే హాస్పిట ల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాషిణి మాట్లాడు తూ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు పలు ఆరోగ్య సూచనలిచ్చారు. పోషక విలువలు, ఆరోగ్యవంతమైన ఆహారం, సమతుల ఆహారం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య వంతమైన ఆహార నియమాల ద్వారా పిల్లల్లో సరైన అభివృద్ధి ఎలా కలుగుతుందో ఈకార్వో ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్లు మధుస్మిత సాహూ, కవితా గుప్తా, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ రామారావు

ఆరిలోవ: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. 10 ఏళ్ల వయస్సున్న కోటి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ఉదయం తప్పిపోయి తిరుగుతున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఆ బాలుడిని పోలీసు స్టేషన్‌కు తరలించి ఆరా తీశారు. బాలుడు తల్లిదండ్రులు కృష్ణ, భావని గుర్తించారు. సీఐ రామారావు సమక్షంలో సాయంత్రం వారికి బాలుడిని అప్పగించారు. దీంతో ఆ తల్లిదండ్రులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మురళీనగర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని అప్సర్ ఖాన్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు జాకెట్ల తయారీకి కటింగ్ విధానాన్ని అప్సర్ ఖాన్ వివరించారు. దారాలు, క్లేతో ఆభరణాల తయారీ విధానంపై హిమబిందు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.పుష్పలత, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

త్వరలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు



ఏఎస్సార్ నగర్‌వాసులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో బుధవారం జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్‌వర్మ.. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, జీవీఎంసీ, టిడ్కో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కంపా హనోకు మాట్లాడు తూ మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధి దారులకు టిడ్కో ఇళ్లను అందజేయాలని కమిషనర్‌ను కోరారు. లబ్ధిదారులు గ్రీన్ బెల్ట్, రోడ్డు పక్కనే తాత్కాలిక నివాసాల్లో నివసిస్తున్నారని వీలైనంత త్వరగా ఇళ్లను కేటాయిస్తే ఇక్కడ సమస్యలు తీరుతాయని తెలిపారు. కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏఎస్సార్ నగర్‌లో 280 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, వాటి చుట్టూ సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పనులు 15 రోజుల్లో పూర్తయ్యేలా చూడాలని టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజినీర్‌ను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా ప్రకారం ఇళ్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలని యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడుకు కమిషనర్ సూచించారు. పర్యటనలో జోన్-5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఏపీడీ పద్మావతి, టిడ్కో హౌసింగ్ సహాయక ఇంజనీర్, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సీనియర్ నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, దుర్గ, నాయుడు, సురేష్, బాబూరావు, మహేష్ ఏఎస్సార్ నగర్ కాలనీ నాయకులు పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ పారాయణం ప్రారంభం



కార్యక్రమానికి హాజరైన వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఇతర అతిథులు

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని గీతాభవన్‌లో గీతా ప్రచార సమితి స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం కోటి శ్రీవిష్ణు సహస్రనామ సామూహిక పారాయణ బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఆచార్య సార్వభౌమ డాక్టర్ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ వల్ల లోక కల్యాణంతో పాటు విశ్వశాంతి కలుగుతాయన్నారు. భక్తులందరూ ముక్తకంఠంతో సామూహికంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి దాతృత్వం



అర్జున్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. 32వ వార్డు నేరెళ్లకోనేరులో నివసించే కప్పరాడ అర్జున్ (46) కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని వార్డు నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి బుధవారం అర్జున్ పెద్దకర్మ సందర్భంగా వారింటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఖర్చుల నిమిత్తం తన సొంత నిధుల నుంచి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అర్జున్ ఇద్దరు ఆడపిల్లల చదువులకు తన వంతు సహకారం అందజేస్తానని, పెద్దమ్మాయికి నర్సింగ్ పూర్తయిన వెంటనే కేజీహెచ్‌లో ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట 32వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మూలే రామిరెడ్డి, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, బాబుల్ శ్రీను, భానుమూర్తి, వేగి వెంకటప్పారావు, కృష్ణవేణి, దేవుడు లక్ష్మి, కుమారి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం వంటావార్పు



జోన్-5 కార్యాలయం వద్ద వంటా వార్పు చేస్తున్న దళిత బహుజనులు

కంచరపాలెం: తాగునీరు, మౌలిక వసతుల కోసం జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం వద్ద బుధవారం 42, 51, 55 వార్డుల పరిధిలోని ఏకలవ్య కాలనీ, ఇందిరాగాంధీ కాలనీ, గాంధీనగర్ మురికివాడలకు చెందిన దళిత బహుజన పేదలు భారీ ఎత్తున వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఇ.లక్ష్మి, ఎం.లక్ష్మి నేతృత్వంలో దళిత బహుజనులు వంటావార్పు చేసి జోనల్ కమిషనర్ కృష్ణ చాంబర్‌ను ముట్టడించారు. ఆయన లేకపోవడంతో సమస్యలు పరిష్కరించే వరకూ కదిలేది లేదంటూ నిరసనకారులు బైఠాయించారు. సుమారు 5 గంటల పాటు జోనల్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. కంచరపాలెం పోలీసుల జోక్యంతో నిరసనకారులను శాంతింపజేశారు. ఆయా మురికివాడల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు సమర్పించినా.. వాటిని కూడా సచివాలయాలకు ఇచ్చి అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆనందం వ్యక్తం చేశారు. సంఘ కన్వీనర్ ఈసరి లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, రోహిణి, బాలనాగమ్మ, నిర్మల, ఏడుకొండలు, ఎం.వెంకటేశ్వర్లు, కె.మల్లయ్య, పి.లక్ష్మి, ఎస్.వి.రమణ, రూప, ఆసనాల అప్పారావు, కొరువాడ అప్పారావు, పైడిరాజు, సతీష్, నాగేశ్వరరావు, రాజేష్, వీర్రాజు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలి



చేపల మార్కెట్ వద్ద శిథిలమైన యూజీడీ మ్యాన్‌హోల్

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు చేపల మార్కెట్ వద్ద ప్రధాన రహదారిలో యూజీడీ మ్యాన్‌హోల్ పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. నగర నలుమూలల నుంచి వచ్చే మురుగు నీరు ఈ మ్యాన్‌హోల్ నుంచే కెనాల్ ద్వారా సముద్రంలో చేరుతుంది. ఇక్కడ ఎవరైనా పడితే ఏకంగా సముద్రంలోనే తేలుతారు. అటువంటి ప్రమాదకర మ్యాన్‌హోల్‌కు జీవీఎంసీ చేసిన తాత్కాలిక రక్షణ చర్యలు చూసి నిరుపయోగంగా మారి మ్యాన్‌హోల్ తిరిగి శిథిలమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వతంగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మధురానగర్ హైస్కూల్‌లో అదనపు అంతస్తు



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్

సీతంపేట: రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ విశాఖను దానికి తగ్గట్టుగానే జీవీఎంసీ అభివృద్ధి చేస్తోందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో రూ.36 లక్షలతో నిర్మించనున్న అదనపు అంతస్తుకు బుధవారం స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ హైస్కూల్‌కు అవసరమైన ఐదు తరగతి గదులను ఈ నిధులతో నిర్మించనున్నట్టు చెప్పారు. ఉత్తర నియోజకవర్గంలోని ప్రతి వార్డులో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మించామన్నారు. కార్పొరేటర్ గోవింద్ మాట్లాడుతూ కె.కె.రాజు సూచనలతో 25వ వార్డు అభివృద్ధికి రూ.1.5 కోట్లు జనరల్ ఫండ్స్ నుంచి, రూ.2 కోట్లు స్టాండింగ్ కమిటీ నిధులు మంజూరు చేసిన మేయర్ హరివెంకటకుమారికి ధన్యవాదాలు తెలిపారు. బీటీఆర్ కాలనీ రెల్లి వీధిలో రూ.1.32 కోట్లతో మూడంతస్తుల భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్సీ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.